www.netifocusnews.com

నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

గురువారం 14, ఆగస్టు 2025 పేజీలు: 04



# రైతుకు ప్రాణసంకటంగా మారుతున్న పురుగు మందుల పిచికారి



2వ పేజీలో..

## వనపర్తి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

- ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్



2వ పేజీలో..



# ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఝాన్సీ రాజేందర్ రెడ్డి

తొర్రూరు, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి /ఓరుగంటి సైదులు)-ఆగస్టు 13:

"కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, తొర్రూరులోని ముస్లిం కమ్యూనిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తాను. విద్య, ఉపాధి, మౌలిక వసతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని. ముస్లింల అభ్యున్నతికి నా సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో, తొర్రూర్ జమా మసీదు నూతన కమిటీ సభ్యులు బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మజీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అలీమ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీర్, కోశాధికారి గౌస్ మిగతా 2లో..

# పల్లె మట్టి వాసనలో భక్తి పరిమళం

## చెర్లపాలెం, హరిపిరాలలో వైభవంగా బోనాల సంబురాలు

### ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి





తొర్రూరు, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి /ఓరుగంటి సైదులు)-ఆగస్టు 13:

శ్రావణ మాసం రాగానే పల్లె గాలిలో పసుపు, కుంకుమ, వేపాకులు, ధూపసువాసనలు కలిసిన భక్తి పరిమళం తేలుతుంది. అదే బోనాల పండుగ వాసన. మట్టి కుండలో అన్నం, బెల్లం, పాలు నైవేద్యంతో పల్లె స్త్రీలు తమ ఇష్టదైవాల ముందు మొక్కులు చెల్లించేందుకు బయలుదేరుతారు. పల్లె వీధుల్లో డప్పుచప్పుళ్లు, మిగతా 2లో..



# ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

(మొదటిపేజీ తరువాయి..)

మొహినుద్దీన్, కమిటీ సభ్యులను కూడా ఝాన్సీ రాజేందర్ రెడ్డి శాలువాలతో సత్కరించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ..తమ ఎన్నిక లో సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధ న్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ మౌలానా పాషా, ఎం.డి.షబ్బీర్ అలీ, ఎం.డి.యా కూబ్ పాషా, ఎస్.డి.చాంద్ పాషా, ఎం.డి.యాకూ బ్, ఎం.డి.ఎజాస్, ఎం.డి.గని, మహమ్మద్ ఇస్లాం, గుంశావలి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మరి యు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# పల్లె మట్టివాసనలో భక్తి పరిమళం

(మొదటిపేజీ తరువాయి..)

శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు%ౌ% జాతి, మత, వర్గ భేదాలు లేకుండా అందరినీ ఒకే భక్తి తరంగంలో ముంచెత్తే పండుగే బోనాలు.

**చారిత్రక నేపథ్యం..**

బోనాల పండుగ మూలాలు కాకతీయుల కాలం వరకూ వెళ్తాయి. చారిత్రక ఆధారాల ప్రకారం, ఒకసారి మసూచి వ్యాధి విపరీతంగా వ్యాపించగా, గ్రామస్తులు అమ్మవారిని శాంతింప చేయడానికి బోనం సమర్పించారు. ఆచారం విజయవంతమై, రోగాలు తగ్గడంతో, “గ్రామాన్ని కాపాడే అమ్మవారికి కృతజ్ఞతగా బోనం సమర్పించాలి” అనే విశ్వాసం ఏర్పడింది. అప్పటినుంచి ఈ సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది.

**శివసత్తుల ఆవేశం.. పోతరాజు ఉత్సాహం..**

బోనం ఎత్తుకొని మహిళలు ఊరేగింపుగా బయలుదేరితే, ఆలయ ప్రాంగణంలో శివసత్తులు పూనకంతో ఊగిపోతారు. ఇది అమ్మవారి ఆవిర్భావం అని గ్రామీణులు నమ్ముతారు. పోతరాజు పసుపు పూసుకొని, నిమ్మమాల ధరించి, చెర్నాకోలు పట్టుకొని ఊరేగింపులో ముందుంటాడు. అతని ఉత్సాహం, నృత్యం బోనాల పండుగలో ముఖ్య ఘట్టం. చెర్నాకోలు తగిలితే పుణ్యం కలుగుతుందని విశ్వాసం.

**ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొనడం..**

ఈ భక్తి, ఉత్సాహం, సంప్రదాయాల సమ్మేళనం నేడు తొర్రూరు మండలంలోని చెర్లపాలెం, హరిపిరాల గ్రామాల్లో కనిపించింది. ఆదివారం జరిగిన బోనాల జాతర ఉత్సవాల్లో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఆమె ప్రత్యేక పూజలు చేసి, బోనం ఎత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ వాద్యాలు, నృత్యాలతో స్వాగతం పలికారు. ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ %–% “బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక. అమ్మవారికి బోనం సమర్పించడం విశ్వాసం, భక్తి, ఐక్యతకు నిదర్శనం. ఈ పండుగలో పాల్గొనడం నాకు గర్వకారణం. తెలంగాణ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి” అని తెలిపారు. గ్రామాల్లో జాతర వాతావరణం ఉత్సాహంగా కనిపించగా, భక్తులు %తీ%పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.





# వనపర్తి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:**

రానున్న 48 గంటల్లో వనపర్తి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ లు సూచించారు. మదనాపురం మండల పరిధిలోని సరళ సాగర్ ప్రాజెక్టుకు భారీ ఎత్తున వరద వచ్చి చేరడంతో ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన సైఫన్ సిస్టం ఓపెన్ అయ్యి రెండు గేట్ల నుండి ఆటోమేటిక్ గా నీరు దిగువకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో వనపర్తి నుంచి ఆత్మకూరు వెళ్లే రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు ఎస్పీ రావుల గిరిధర్ లు హుటా హుటిన అక్కడికి వెళ్లి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మదనాపురం దగ్గర ఉన్న కాజ్ వే, బ్రిడ్జ్ గుండా ఎవరూ వెళ్లకుండా రోడ్డు మూసేశారు. కొత్తకోట నుండి ఆత్మకూరు వెళ్లే ప్రయాణికులు రాచాల మీదుగా దేవరకద్ర నుండి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని కోరారు. జిల్లాలో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని ఇంట్లో నుండి బయటికి రావద్దని సూచించారు. వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పోలీసు శాఖ 24 గంటలు అందుబాటులో ఉంటారని వారు చెప్పారు.

# రైతుకు ప్రాణసంకటంగా మారుతున్న పురుగు మందుల పిచికారి

**తొర్రూరు, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి/ ఒరుగంటి సైదులు)-ఆగస్టు 13:**

వ్యవసాయంలో పురుగు మందుల ప్రాధాన్యం ఎంతున్నా, వాటి వినియోగంలో నిర్లక్ష్యం రైతు ఆరోగ్యానికి పెద్ద ముప్పును తెస్తుంది. దిగుబడులు, నాణ్యత కాపాడుకోవడం కోసం రైతులు చీడపీడల నియంత్రణకు క్రిమిసంహారక మందులను విస్తృతంగా వాడుతున్నారు. కానీ మోతాదు, పద్ధతి, రక్షణా చర్యలు పాటించకపోతే పంటతో పాటు రైతుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుంది.

**నానాటికి పెరుగుతున్న పురుగు మందుల వాడకం**

వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం, వాణిజ్య పంటలపై పంట కాలంలో సగటున 6–10సార్లు రసాయనల పిచికారీ జరుగుతోంది. కొంతమంది రైతులు ఒక్క సీజన్‌లో 15సార్లకు పైగా కూడా స్ప్రే చేస్తున్నారు. ఫలితంగా, రైతులకు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తెలంగాణలో ఇటీవల కాలాల్లో పురుగు మందుల ప్రభావంతో 250 మందికిపైగా రైతులు ప్రాణాలు కోల్పోయారు అలాగే దేశ వ్యాప్తంగా ఎంతో మంది రైతులు ప్రతి సంవత్సరం ప్రాణాలు కోల్పోతున్నారు, అనారోగ్యం బారిన పడుతున్నారు అంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా వుందో అర్థమవుతుంది.

**అవసరమైతేనే మందులు పిచికారి చేయడం ఉత్తమం**

ప్రతి చిన్న చీడపీడకూ వెంటనే మందులు పిచికారి చేయడం అవసరం లేదు. పంటలో చీడపీడల చేసే నష్టం ఎకనామిక్ థ్రెషోల్డ్ లెవెల్ దాటినప్పుడు మాత్రమే మందులు వాడాలి. లేకపోతే పంటకు మేలు చేసే కందిరీగలు, తేనేటీగలు, అక్షింతల పురుగులు కూడా చనిపోతాయి.

**సరైన మందు-సరైన మోతాదు**

పంట రకానికి, చీడపీడల రకానికి సరిపోయే మందును మాత్రమే ఎంపిక చేయాలి.

ఎక్కువ మోతాదు పిచికారి చేస్తే తొందరగా చస్తాయి అన్న అపోహ వదలాలి. అధిక మోతాదు వలన పురుగుల రోగనిరోధక శక్తి పెరుగుతుంది, ఖర్చు పెరుగుతుంది, పంటకు హాని జరుగుతుంది.



**సరైన పరికరాల వాడకం**

స్ప్రేయర్లు, డస్టర్లు శుభ్రంగా ఉంచి, సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి. చేత్తో పొడి మందులు చల్లడం మానేయాలి. పిచికారీ సమానంగా, ఆకుల కింద భాగానికీ తగిలేలా చేయాలి.

**వ్యక్తిగత రక్షణ చర్యలు**

పిచికారీ సమయంలో పూర్తి బాడీ కవర్ అయ్యే దుస్తులు, చేతి తొడుగులు, ముఖ కవచం ధరించాలి.

గాలికి ఎదురుగా పిచికారీ చేయరాదు.

మందు కలుపుతున్నప్పుడు చేత్తో కలపకూడదు, కర్ర లేదా పుల్ల ఉపయోగించాలి.

పిచికారీ చేస్తూ పొగ త్రాగడం, నీళ్లు తాగడం, ఆహారం తినడం చేయకూడదులి .

పిచికారీ అనంతరం సబ్బుతో చేతులు కడుక్కోవడం, స్నానం చేయడం తప్పనిసరి.

**రైతులు తప్పక గుర్తుంచుకోవాల్సిన అంశాలు**

పాత, గడువు ముగిసిన మందులు వాడరాదు.

రెండు మందులు కలపాలంటే అవి కలిసే స్వభావం ఉందో లేదో చెక్ చేయాలి.

పిల్లలు, పశువులు మందుల దగ్గరికి రాకుండా జాగ్రత్త పడాలి.

స్ప్రేయర్ నాజిల్‌ను నోటితో ఊదకూడదు.

నీటి నాణ్యత పరిశీలించాలి–అధిక ఉప్పుతనం గల నీటిని వాడరాదు.

కొన్ని రకాల పురుగుమందులు ఉదాహరణకు ,మోనోక్రోటోఫాస్, ఆక్సిడి మోటాన్, మిథైల్, ఆసిఫేట్ వంటి మందులు అత్యంత విషపూరితం. ఇవి పిచికారీ చేసే సమయంలో గాలి ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరి, నేరుగా మెదడుపై ప్రభావం చూపుతాయి. కొన్నిసార్లు ప్రాథమిక చికిత్సకు కూడా సమయం దొరకక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఇంకా ఇలాంటి మందులు మార్కెట్లో చాలా ఉన్నాయి కాబట్టి ప్రతి రైతు పిచికారి చేసే సమయంలో రక్షణా దుస్తులు తప్పనిసరిగా ధరించాలి.”

పంటను రక్షించుకోవడం ఎంత అవసరమో, ప్రాణాన్ని రక్షించుకోవడం అంతకంటే ముఖ్యమైంది. ప్రతి రైతుకు

పంటతో పాటు, ప్రాణం కూడా విలువైనదే కాబట్టి అవగాహనతో జాగ్రత్తలు పాటిస్తే, పంట దిగుబడి, నాణ్యత, పెంచుకోవడం తో పాటు రైతు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. వీలైతే రైతులు రసాయన ఎరువుల, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళితే పుడమికి, రైతుకు, పర్యావరణ ఎంతో మంచిది.

**జి.అజయ్ కుమార్**
**(వ్యవసాయ నిపుణులు)**








# యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దు

● అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

కె.అనిల్ కుమార్

మహబూబాబాద్, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి /ఒరుగంటి సైదులు)-ఆగస్టు 13:

యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో శాశ్వతంగా డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు, యువత డ్రగ్స్ వైపు దృష్టి సారించకుండా ఉండేందుకు, మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. నేను మాదకద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలక భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని. ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి వెల్ఫేర్ అధికారిని శిరీష, బిసి వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస రావు, మైనారిటీ అధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది రాజు, కొప్పు ప్రసాద్, కలెక్టరేట్‌లోని సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్ అలర్ట్ జోన్‌లోకి వనపర్తి జిల్లా

● ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి ● అవసరమైతే తనకు నేరుగా ఫోన్ చేయండి ● ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్):



రాష్ట్రమంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాల కారణంగా వనపర్తి జిల్లా ఎల్లో జోన్ నుంచి రెడ్ జోన్‌లోకి చేరినట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారు. ఎంతో అవసరమైతే తప్ప అత్యవసర పరిస్థితుల్లోనే ప్రయాణాలు చేయాలని లేదంటే రెండు రోజులపాటు వాయిదా వేసుకోవాలని సూచించారు.మట్టి మిద్దెల్లోనూ శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లోనూ నివాసం ఉండేవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వాగులు వంకలు ఉన్నచోట ప్రయాణాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షాల కారణంగా ఇబ్బంది పడే వారికి నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు చేయూతనందించి సహకరించాలని ఆయన కోరారు. వర్షం కారణంగా ఎవరైనా అత్యవసర ఇబ్బందులకు గురైతే తనకు నేరుగా ఫోన్ చేయాలని 9494216666 కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ అత్యవసర సమయాల్లో ఆదుకునేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎటువంటి సమస్య ఉన్న 08545-220351- 233525 కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# చిన్న పిల్లల 108 అంబులెన్సును మేనేజర్ శ్రీను ఆకస్మిక తనిఖీ

ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి

(నేటి ఫోకస్‌న్యూస్)/వారకొండ వెంకటేష్-ఆగస్టు 13:

అచంపేట్ ప్రభుత్వ దావఖానలో చిన్న పిల్లల 108 అంబులెన్సు ను జిల్లా మేనేజర్ బుధవారం శ్రీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్సు లోని వైద్య పరికరాలు, మందులు మరియు సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో 24 గంటలు ఉండే ఈ అంబులెన్స్ ను నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అవసరమైతే నాగర్ కర్నూల్, అచంపేట్ నుండి హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు కూడా ఉచితంగా తరలిస్తామని చెప్పారు. అంబులెన్సు సిబ్బంది శివరాజ్, ఇబ్రహీం పాల్గొన్నారు.





# బోనాలు తెలంగాణ ఆత్మ

● మాజీ జెడ్పీటీసీ జ్యోతిర్మయి సుధీర్ కుమార్

పెద్దవంగర, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి/ ఒరుగంటి సైదులు)-ఆగస్టు 13:

బోనాల పండుగ అనేది తెలంగాణ సంస్కృతి, భక్తి, ఐక్యతకు ప్రతీక. ఈ పండుగలో గ్రామం మొత్తం ఒక్కటై అమ్మవారిని ఆరాధించడం మన సంప్రదాయంలో అపూర్వమైన విషయం. భక్తి, ఆనందం, ఐక్యత కలిసే పండుగ బోనాలు" అని పెద్దవంగర మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బోనాల పండుగ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్ కుమార్ ముత్యాలమ్మ దేవాలయానికి వెళ్ళి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకొని, కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. "బోనాలు మన గ్రామీణ జీవితంలో ఆనందం, భక్తి కలగలిపిన పండుగ." "అమ్మవారి ఆశీర్వాదాలతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను." "తెలంగాణ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిదీ. అమ్మవారికి బోనం సమర్పించడం కేవలం ఆచారం మాత్రమే కాకుండా, మన పల్లె సంస్కృతి, పూర్వీ కుల విశ్వాసాలను తరతరాలకు అందించే విలువైన సంప్ర దాయం అని పేర్కొన్నారు.

# హుండీ దొంగల అరెస్ట్

● ఎస్సై శివకుమార్

పెద్దమందడి, (నేటి ఫోకస్ న్యూస్):



పెద్దమందడి, మణిగిల్ల గ్రామాల శివారులో గల చౌదరిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ దొంగతనం చేసిన నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. గోపాల్పేట మండలం తాడిపర్తికి చెందిన మహమ్మద్ షఫీ, షేక్ రసూల్, మహమ్మద్ అన్వర్ లు కార్, ఆటో డ్రైవర్లుగా పనిచేస్తూ జల్సా లకు అలవాటు పడి ఈనెల 7న మధ్యరాత్రి ఆలయంలోకి చొరబడి హుండీలో ఉన్న 25వేల నగదు స్వామి ఆభరణాలకు చెందిన వెండి వస్తువులను దొంగిలించినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో సీసీ పుటేజీల ఆధారాల మేరకు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం ఒప్పుకొని హుండీని జగత్ పల్లి చెక్ డ్యామ్ లో వేసినట్లు ఒప్పుకున్నారని ఎస్సై శివకుమార్ తెలిపారు. అలాగే డిసెంబర్లో బిజినపల్లి మండలం మంగనూరు గ్రామంలో చౌడేశ్వరి ఆలయంలో ఇదే మాదిరి దొంగతనానికి పాల్పడి పదివేల విలువగల వస్తువులు అమ్మి ముగ్గురు సమానంగా పంచుకున్నట్లు వారి విచారణలో తెలిపినట్లు ఆయన తెలిపారు. నిందితుల నుండి కొంత డబ్బుతో పాటు ట్రాలీ ఆటో రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఘన స్వాగతం

● తునికి నల్ల పోచమ్మ దేవి ఆలయంలో పూజలు

ఫోకస్ న్యూస్, కౌడిపల్లి, 13:

మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి హార్ట్ ఆపరేషన్, ఆరు నెలల విరామం తర్వాత స్వగ్రామానికి బుధవారం రావడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు ,నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి తునికి కమాన్ వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి ఘన స్వాగతం పలికా. అనంతరం తునికి నల్ల పోచమ్మ కమాన్ నుంచి ఆలయ వద్దకు మూడు కిలోమీటర్ల వరకు కాన్వాయ్ తో ర్యాలీగా వెళ్లి ప్రత్యేక పూజలు అనంతరం టపాకాయలు కాల్చి స్వాగతం పలికారు. కౌడిపల్లిలోని పలు ఆలయాలను సందర్శించి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పూజలు చేసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, మహమ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి,జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా కోశాధికారి శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సున్నం సతీష్, మండల , మాజీ నల్ల పోచమ్మ డైరెక్టర్ దొంతుల దుర్గయ్య, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ దొంతుల రాజు, దొంతుల శ్రీను, వీర గౌడ్ , కృష్ణ, సురేష్, యాదగిరి, బాబర్, కిరణ్ గౌడ్, బాలరాజ్, నాయకులు పుండరీకంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెర్లపాలెంలో ఎల్లమ్మ గుడికి విరాళం

● అనుమండ్ల మాధవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

తొర్రూరు, ఫోకస్ న్యూస్ ప్రతినిధి/ఒరుగంటి సైదులు)-ఆగస్టు 13: తొర్రూరు పట్టణ కేంద్రంలోని చర్లపాలెం గ్రామంలోని ముత్యాలమ్మ గుడి పునర్నిర్మాణానికి అనుమండ్ల మాధవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. గత కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని కొత్తగా నిర్మించేందుకు అవసరమైన మొత్తాన్ని ట్రస్ట్ భరిస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమండ్ల తిరుపతిరెడ్డి తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామాన్ని సందర్శించిన ఆయన, ముత్యాలమ్మ గుడి నిర్మాణం త్వరలో ప్రారంభించి గ్రామస్తుల ఆశయాన్ని నెరవేర్చడమే మా లక్ష్యం అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ...ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు, గ్రామ ప్రజల ఏకతతో ఈ పనులు వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది బోనాల పండుగకు ముందే గుడి నిర్మాణం పూర్తి చేసి, కొత్త గుడికి భక్తులు దర్శనానికి సిద్ధం కావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమండ్ల తిరుపతి రెడ్డి అన్నారు.ఈ వార్త తెలిసిన వెంటనే పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు తిరుపతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బోనాల సందర్భంగా తల్లిని దర్శించుకున్న భక్తులు మాట్లాడుతూ.. మా బాల్యం నుండి ఉన్న కల ఇప్పుడు నెరవేరబోతోంది. మా తరాలవారు కొత్త గుడిలో తల్లిని దర్శించుకునే రోజు దగ్గరలోనే ఉంది అని తెలిపారు.ముత్యాలమ్మ గుడి కేవలం ఆరాధన స్థలం మాత్రమే కాదు, గ్రామ ఏకతకు ప్రతీక,పునర్నిర్మాణం పూర్తయిన రోజు చెర్లపాలెం చరిత్రలో బంగారు అక్షరాల్లో నిలిచిపోనుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.